# ఒక అభ్యర్థి ఉపసంహరణ



మాట్లాడుతున్న ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, ఏప్రిల్ 29 : ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎంపీ అభ్యర్థులుగా నామినేషన్‌లు సమర్పించిన వారిలో ఒకరు నామినేషన్ ఉపసంహరించుకున్నారని ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని రిటర్నింగ్ కార్యాలయంలో అభ్యర్థుల సమక్షంలో నామినేషన్ల ఉపసంహరణ చేశారు. 13 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా.. ఇండిపెండెంట్ అభ్యర్థి రాథోడ్ రాజు తమ నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. ఇంకా ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల బరిలో 12 మంది ఉన్నారని తెలిపారు. ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులకు సాధారణ పరిశీలకులు, అభ్యర్థుల సమక్షంలో గుర్తులను కేటాయిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ నియోజకవర్గ జనరల్ అబ్జర్వర్ రాజేంద్రవిజయ్, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి పాల్గొన్నారు.

# సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలి..



ప్రచారం నిర్వహిస్తున్న ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి సక్కు, మాజీ మంత్రి రామన్న

ఎదులాపురం, ఏప్రిల్ 29 : పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థిగా ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. ప్రచారంలో భాగంగా సోమవారం సాయంత్రం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు మాట్లాడుతూ.. ఆదివాసుల సమస్యలను పరిష్కరించింది బీఆర్‌ఎస్ పార్టీ అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు రోకండ్ల రమేశ్, డీసీసీబీ డైరెక్టర్ పరమేశ్వర్, నాయకులు జగదీశ్, మోతీరాం, గంద్రత్ రమేశ్, శ్యాంరావు పాల్గొన్నారు.

# సక్కు గెలుపునకు కృషి చేయాలి..

- ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్
- బీఆర్‌ఎస్‌లో కాంగ్రెస్ నాయకుల చేరిక

ఖానాపూర్, ఏప్రిల్ 29 : పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి కార్యకర్త బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి ఆత్రం సక్కు గెలుపునకు కృషి చేయాలని ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని తన నివాసంలో మండలంలోని గోసంపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సైలాబ్‌తోపాటు పలువురు నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జాన్సన్ నాయక్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి పనులను చూసి బీఆర్‌ఎస్ పార్టీలో చేరినట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు మాటలకే పరిమితమయినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మొయిద్, పట్టణ, మండల అధ్యక్షులు గౌరికర్ రాజు, రాజగంగన్న, నాయకులు ధర్మరాజు, ఖలీల్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ నాయకులకు కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న జాన్సన్ నాయక్



ముథోల్ నియోజకవర్గంలోని కుభీర్ మండలంలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు కిరణ్ కొమ్రేవార్



నిర్మల్ నియోజకవర్గంలోని మామడ మండలం కొరిటికల్‌లో ప్రచారం నిర్వహిస్తున్న మాజీ డీసీసీబీ అధ్యక్షుడు కొరిపెల్లి రాంకిషన్‌రెడ్డి



కుంటాల మండలంలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు పడకంటి రమాదేవి

# గులాబీ దూకుడు

- రంగంలోకి సీనియర్ నేతలు
- అడుగడుగునా జనాదరణ
- కరెంటు కోతలు, కొనుగోళ్లు, రుణమాఫీపై జనాగ్రహం
- బీజేపీ, కాంగ్రెస్ నేతలకు తప్పని నిలదీతలు
- కేసీఆర్ పాలనే భేష్ అంటూ జనం కితాబు

నిర్మల్, ఏప్రిల్ 29(నమస్తే తెలంగాణ) : పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో బీఆర్‌ఎస్ పార్టీ తన ప్రచార దూకుడును పెంచింది. కాంగ్రెస్, బీజేపీలను లక్ష్యంగా చేసుకుని ఎన్నికల ప్రచారపర్వానికి తుదిమెరుగులు దిద్దింది. ఇందు కోసం పార్టీ జిల్లా స్థాయి నేతలు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ప్రచార పర్వాన్ని హోరెత్తించేందుకు రూట్ మ్యాప్‌లు సిద్ధం చేసుకున్నారు. నిర్మల్ జడ్పీ చైర్‌పర్సన్ కొరిపెల్లి విజయలక్ష్మి, ఆమె భర్త డీసీసీబీ మాజీ చైర్మన్ రాంకిషన్‌రెడ్డితోపాటు పార్టీ పట్టణాధ్యక్షుడు రాములు ప్రచార పర్వాన్ని మొదలు పెట్టారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో వీరు ప్రచార పర్వానికి శ్రీకారం చుట్టారు. పార్టీని కొందరు వీడుతున్నా.. సాధారణ కార్యకర్తల్లో మనోధైర్యం చెక్కు చెదరడం లేదు. తామంతా నమ్ముకున్న తెలంగాణ సిద్ధాంతానికి, అధినేత కేసీఆర్ ఆశయాలకు కట్టుబడి ప్రచారంలో దూసుకుపోతున్నారు. కేసీఆర్ హయాంలో అమలైన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ ప్రచారాన్ని వేడెక్కిస్తున్నారు. ముథోల్ నియోజకవర్గంలో మహిళా నేత పడకంటి రమాదేవి ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు కిరణ్ కొమ్రేవార్, విలాస్ గాదేవార్, లోలం శ్యాంసుందర్‌లు ప్రచారంలో దూసుకుపోతున్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును గెలిపించాలని కోరుతున్నారు. కాంగ్రెస్, బీజేపీలను లక్ష్యంగా చేసుకుంటూ విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. బీఆర్‌ఎస్‌లో ఉండి ప్రస్తుతం ఇతర పార్టీల్లో చేరిన వారు ప్రచారానికి వస్తే నిలదీయాలని కోరుతున్నారు. ఖానాపూర్ నియోజకవర్గంలో పార్టీ ఇన్‌చార్జి భుక్యా జాన్సన్ నాయక్ ప్రచార పర్వంతోపాటు, ఎన్నికల వ్యూహాల అమలు వంటి బాధ్యతలను తన భుజాలపై వేసుకుని ముందుకు సాగుతున్నారు. క్రియాశీలక, సాధారణ కార్యకర్తలకు ప్రాధాన్యత కల్పిస్తూ ప్రచార బాధ్యతలను అప్పగిస్తున్నది. కాగా.. బీఆర్‌ఎస్ నేతలకు గ్రామీణ స్థాయిలో పూర్తి మద్దతు లభిస్తుండడంతో.. పూర్వ ఉత్సాహం కనిపిస్తున్నది. ప్రజల ఆదరణను చూసిన బీఆర్‌ఎస్ నాయకులు గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు పూర్తవుతున్నా రైతుబంధు, రుణమాఫీ హామీలు అమలు చేయకపోవడంతో రైతులు నిలదీస్తున్నారు.



ఖానాపూర్ నియోజకవర్గంలోని గిరిజన తండాల్లో లంబాడాలను కలుస్తూ బీఆర్‌ఎస్‌కు మద్దతునివ్వాలని కోరుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి భుక్యా జాన్సన్ నాయక్

## అడుగడుగునా జనాదరణ

ప్రచారానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుండడంతో బీఆర్‌ఎస్ పార్టీ కేడర్‌లో ఉత్సాహం నెలకుంటున్నది. మొన్నటి ఎన్నికల ఓటమి, కొంతమంది పార్టీలు మారడంతో తాత్కాలికంగా కొంత నిరుత్సాహానికి గురయ్యారు. అయితే పార్టీ అధినేత కేసీఆర్ రంగంలోకి దిగి బస్సుయాత్ర ద్వారా ప్రచార పర్వానికి శ్రీకారం చుట్టడమే కాకుండా, తన వాడివేడీ ప్రసంగాలతో జనాలను విశేషంగా ఆకట్టుకుంటుండడంతో మరోసారి రాజకీయ వాతావరణం బీఆర్‌ఎస్‌కు అనుకూలంగా మారిందంటున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని బీఆర్‌ఎస్ పార్టీ కేడర్ అంతా ఏకమై గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు.

## సర్కారు హామీలపై విమర్శనాస్త్రాలు

మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు కాకపోవడాన్ని బీఆర్‌ఎస్ అస్త్రంగా మలచుకుంటున్నది. రుణమాఫీ, రైతుబంధు, కరెంటు కోతలు, సాగు తాగునీటి కొరత, నిధుల కొరత, పంట కొనుగోళ్లలో జాప్యం వంటి అంశాలను ప్రజల ముందు ఉంచి గత కేసీఆర్ పాలనతో పోల్చి చెబుతూ ప్రచారం చేస్తున్నారు. దీంతోపాటు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లోని వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ బీఆర్‌ఎస్ ఎదురుదాడి మొదలు పెట్టింది. కరెంటు కోతల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందంటూ బీఆర్‌ఎస్ నాయకులు చేస్తున్న విమర్శలకు రైతుల నుంచే కాకుండా ప్రజల నుంచి కూడా మంచి స్పందన లభిస్తున్నది. మరోసారి బీఆర్‌ఎస్ గెలవాలని, కేసీఆర్ మళ్లీ అధికారంలోకి రావాలంటూ జనం బాహాటంగానే పేర్కొంటున్నారు.

## లంబాడా ఓట్లపై ప్రత్యేక గురి

లంబాడా ఓట్లపై బీఆర్‌ఎస్ ఈసారి వ్యూహాత్మకంగా గురి పెట్టింది. ముఖ్యంగా ఖానాపూర్ సెగ్మెంట్‌లో పార్టీ ఇన్‌చార్జీ భుక్యా జాన్సన్ నాయక్ తండాల్లో ప్రత్యేక ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. దీనికోసం తండాలవారీగా ప్రత్యేక రూట్ మ్యాప్ రూపొందించి దానికి అనుగుణంగా రోజు తండాలను సందర్శిస్తూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టి పనులను వివరిస్తున్నారు. పంచాయతీల ఏర్పాటు, రహదారుల నిర్మాణాలు, మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సదుపాయం, పోడు భూములకు పట్టాలు వంటి వాటిపై ఆయన ప్రచారం చేస్తూ జనాన్ని ఆకట్టుకుంటున్నారు.

# ట్రిపుల్ ఐటీలో వెలువడని నోటిఫికేషన్

- ఇంకా ఏర్పాటు కాని అడ్మిషన్ కమిటీ
- నేడు పదో తరగతి ఫలితాలు
- ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు
- ట్రిపుల్ ఐటీలో పర్యవేక్షణ కరువు




బాసర ట్రిపుల్ ఐటీ ముఖద్వారం

బాసర, ఏప్రిల్ 29 : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసర సరస్వతీ అమ్మవారి చెంత రాష్ట్రంలోనే ఏకైక ట్రిపుల్ ఐటీ ఉంది. గ్రామీణ పేద విద్యార్థుల కోసం 2008లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్సార్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మూడు ట్రిపుల్ ఐటీలు ఏర్పాటు చేశారు. ఇందులో ఒకటి బాసరలో నిర్మించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నాలుగున్నర నెలలు గడిచినా ట్రిపుల్ ఐటీని పట్టించుకోవడం లేదు. కనీస బడ్జెట్‌ను కూడా కేటాయించలేదు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇప్పటివరకు ప్రవేశ అర్హత పరీక్ష నోటిఫికేషన్‌ను విడుదల చేయలేదు. ప్రస్తుత ఇన్‌చార్జి వీసీ వెంకటరమణ నెలలో ఒకటి లేదా రెండు పర్యాయాలు మాత్రమే ట్రిపుల్ ఐటీని సందర్శిస్తున్నారు. ఇన్‌చార్జి వీసీ పర్యవేక్షణ కరువవడంతో సమస్యలు పేరుకు పోతున్నాయి.

## ఏర్పాటు కాని అడ్మిషన్ కమిటీ

2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ట్రిపుల్ ఐటీ ప్రవేశాల కోసం అడ్మిషన్ కమిటీ ఏర్పాటు చేయాలి. కానీ.. ఇప్పటివరకు అడ్మిషన్ కమిటీని ఏర్పాటు చేయలేదు. గతేడాది ఉన్న అడ్మిషన్ కమిటీని కొనసాగిస్తారా? లేదా కొత్త కమిటీ ఏర్పాటు చేస్తారా? అనే సందిగ్ధంలో సిబ్బంది ఉన్నారు. అడ్మిషన్ కమిటీలో కీలకంగా ఉండే కన్వీనర్ పోస్టుకు బదులుగా కో-ఆర్డినేటర్, సభ్యులను నియమించనున్నట్లు సమాచారం.

## నేడు పదో తరగతి ఫలితాలు

రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం పదో తరగతి ఫలితాలను వెలువరించనున్నది. ఇంకా ట్రిపుల్ ఐటీలో నోటిఫికేషన్ విడుదల కాకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ పిల్లల భవిష్యత్ సందిగ్ధంలో ఉందని, ఇటు ప్రైవేటు కళాశాలలను ఆశ్రయిస్తే అడ్వాన్సులు కట్టమని అడుగుతున్నారని పేర్కొంటున్నారు. నోటిఫికేషన్ విడుదల కాక తమ పిల్లల చదువులు అయోమయంలో పడ్డాయని, ప్రభుత్వం స్పందించి నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరుతున్నారు.

## ఈ యేడాది 500ల సీట్లు తగ్గిస్తున్నారా?

ఈ విద్యాసంవత్సరం 1500ల సీట్లను ప్రభుత్వం 1000 సీట్లకు కుదిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 2000 సీట్లతో ట్రిపుల్ ఐటీని స్థాపించింది. అనంతరం రెండేండ్ల పాటు కొనసాగించి అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం 1000కి కుదించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక 2018లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం 1000 సీట్లను 1500లకు పెంచింది. మళ్లీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక 1500 సీట్లను 1000 సీట్లకు కుదించనున్నట్లు సమాచారం.

## పర్యవేక్షణ కరువు

ట్రిపుల్ ఐటీలో పర్యవేక్షణ లోపించిందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్థానికంగా ఉండడం లేకపోవడం కూడా ఇందుకు కారణం. ఇంతకు ముందు డైరెక్టర్ స్థానికంగానే ఉన్నప్పటికీ ఆయనను రిలీవ్ చేయడంతో స్థానికంగా ఏ ఉన్నతాధికారి అందుబాటులో లేకపోవడం, ట్రిపుల్ ఐటీకి ఇన్‌చార్జి వీసీగా ఉన్న ప్రొఫెసర్ వెంకటరమణ అప్పుడప్పుడు వచ్చి పోతుండడం, ఇక్కడ స్థానికంగా ఉండకపోవడంతో పర్యవేక్షణ కరువైందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

## తనకు అనుకువైన వారికే కీలక పోస్టులు

ట్రిపుల్ ఐటీ ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్ కొన్ని విభాగాల్లో తనకు అనుకువయిన వాళ్లకే కీలక పోస్టులు ఇస్తున్నారనే విమర్శలున్నారు. ఇటీవలే అన్ని విభాగాల్లో డీన్‌లను మార్చినప్పటికీ ఒక విభాగం డీన్‌ని మార్చలేదు. కీలక విభాగమైన కంట్రోలర్ ఆఫ్ ఎక్సామినర్(సీవోఈ)తోపాటు ప్రొక్యూర్‌మెంట్‌లో పని చేస్తున్న కింది స్థాయి సిబ్బందిని కూడా మార్చలేదు. రెండు నెలల క్రితం డైరెక్టర్ సతీశ్‌కుమార్ పదవి కాలం ముగియడంతో ఆయనను రిలీవ్ చేశారు. ఇద్దరి మధ్య సరైన సఖ్యత లేక పోవడంతో డైరెక్టర్‌ను రిలీవ్ చేసి తనకు అనుకువైన వాళ్లని స్పెషల్ ఆఫీసర్‌గా నియమించుకున్నారు.

# బీఆర్‌ఎస్‌కు మళ్లీ పూర్వవైభవం

- లోకసభ ఎన్నికల్లో మళ్లీ గెలుపు మాదే..
- నాలుగు నెలల్లోనే కాంగ్రెస్ సర్కారు పాలనలో వైఫల్యం
- బీజేపీని ప్రజలు విశ్వసించడం లేదు
- కేసీఆర్‌పై ప్రజల్లో ఆదరణ తగ్గలేదు
- నిర్మల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ సమన్వయకర్త రాంకిషన్‌రెడ్డి



రాంకిషన్‌రెడ్డి

నిర్మల్, ఏప్రిల్ 29(నమస్తే తెలంగాణ) : తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లిందని, బీజేపీకి అడుగడునా ఆదరణ లభించడం లేదని, పార్లమెంటు ఎన్నికల ద్వారా బీఆర్‌ఎస్ పార్టీకి మళ్లీ పూర్వవైభవం రాబోతున్నదని ఆ పార్టీ నిర్మల్ నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు కొరిపెల్లి రాంకిషన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం బీఆర్‌ఎస్ అధిష్ఠానం రాంకిషన్‌రెడ్డిని నిర్మల్ నియోజకవర్గ పార్టీ సమన్వయ కమిటీ సభ్యునిగా నియమించింది. ఈ సందర్భంగా ఆయన 'నమస్తే'తో మాట్లాడారు. నియోజకవర్గంలోని పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ సమన్వయంతో పార్టీ అభ్యర్థి సక్కు గెలుపునకు కృషి చేస్తానన్నారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌పై ప్రజల్లో రోజురోజుకు ఆదరణ పెరుగుతున్నదని, మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన తప్పుడు హామీలను ప్రజలు విశ్వసించారే తప్పా.. తమను నిర్లక్ష్యం చేయలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలంటూ ఇచ్చిన 420 హామీలన్నీ బుట్టదాఖలవుతున్నాయని ధ్వజమెత్తారు. ఆ పార్టీలో సమన్వయం కొరవడిందని, సీఎం పదవి కోసం పార్టీ నేతలంతా పోటాపోటీగా ఇప్పటి నుండే కుతంత్రాలు చేస్తున్నారన్నారు. తన పదవిని కాపాడుకునేందుకే రేవంత్‌రెడ్డి పదే పదే బీఆర్‌ఎస్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. బీజేపీ కేవలం ప్రజలను పక్కదోవ పట్టించేందుకే ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. లోకసభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ ఘన విజయం సాధించి పూర్వవైభవాన్ని సంతరించుకోనున్నదన్నారు.

## బీఆర్‌ఎస్ గెలుపు తథ్యం

ఇప్పటికే ప్రజలు బీఆర్‌ఎస్‌ను గెలిపించేందుకు సిద్ధమయ్యారని తెలిపారు. బీఆర్‌ఎస్ తోనే ప్రజలందరికీ సమ న్యాయం జరుగుతుందని, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు పెద్ద ఎత్తున అమలవుతాయన్నారు. కేవలం తమ పదవులను కాపాడుకునేందుకే కాంగ్రెస్ మంత్రివర్గమంతా ఉదయం నుంచి సాయంత్రం వరకు శ్రమిస్తున్నారే తప్పా.. ప్రజల వైపు చూడటం లేదన్నారు. మండు వేసవిలో ఇటు కరెంటు కోతలు, అటు సాగు తాగు నీటి ఇబ్బందులతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే మంత్రులు, ప్రజాప్రతినిధులు ప్రసంగాలకే పరిమితమవుతున్నారే తప్పా క్షేత్రస్థాయిలో పర్యటించి జనం గోడు ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ప్రజల కష్ట సుఖాలను తెలుసుకునే ఓపిక కాంగ్రెస్ నాయకులకు లేకుండా పోయిందన్నారు. బీఆర్‌ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని, ప్రజల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు బీఆర్‌ఎస్‌కే పట్టం కట్టేందుకు సిద్ధమయ్యారని స్పష్టం చేశారు.

# పెరిగిన పోలింగ్ కేంద్రాలు

- ఆదిలాబాద్ పార్లమెంట్‌లో 2,198
- 200 ఓటర్లు ఉన్న గ్రామాల్లో ఏర్పాటు



ఆదిలాబాద్, ఏప్రిల్ 29(నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు పూర్తిస్థాయిలో తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి మే 13న పోలింగ్ జరగనుండగా ప్రజలు ఇబ్బందులు లేకుండా ఓటు వేసేందుకు చర్యలు చేపట్టారు. పార్లమెంట్ పరిధిలోని ఆదిలాబాద్, నిర్మల్, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో ఏడు నియోజకవర్గాలు ఉండగా.. 16,50,175 మంది ఓటర్లు ఉన్నారు. వీరి కోసం 2,111 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మారుమూల గ్రామాలు, ఆదివాసీ గూడేలకు రవాణా మార్గాలు సరిగా లేకపోవడం వల్ల పోలింగ్ కేంద్రాలకు వెళ్లడం ఇబ్బంది అవుతున్నది. కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు ఆవశ్యకతను వివరిస్తూ ఎన్నికల సంఘానికి ప్రతిపాదనలు పంపించగా.. కొత్తగా 86 కేంద్రాల ఏర్పాటుకు అనుమతి ఇచ్చింది.

## 2,198 పోలింగ్ కేంద్రాలు

ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఏడు అసెంబ్లీ స్థానాల్లో పోలింగ్ కేంద్రాల సంఖ్య 2,198కి చేరింది. 200 ఓట్లు ఉన్న గ్రామాల్లో కొత్తగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. సిర్పూర్‌లో గతంలో 293 ఉండగా 320, ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 304 ఉండగా 356, ఖానాపూర్‌లో 305 ఉండగా 308, ఆదిలాబాద్‌లో 290 ఉండగా 292, బోథ్‌లో 302 ఉండగా 306, నిర్మల్‌లో 306, ముథోల్‌లో 311 ఉండగా ఏమి పెరుగలేదు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో ఎక్కువగా 356, ఆదిలాబాద్‌లో తక్కువగా 292 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. కొత్త కేంద్రాల ఏర్పాటుతో ప్రజల ఓటు వేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ఫలితంగా ఈ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెరిగే అవకాశాలున్నాయి.

# ఫిర్యాదులకు సంప్రదించాలి..

ఎదులాపురం, ఏప్రిల్ 29 : ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి ఏమైనా సందేహాలు, ఫిర్యాదులు ఉంటే సెల్ నంబర్ 8143876383కు సంప్రదించవచ్చని ఎన్నికల వ్యయ పరిశీలకుడు జాదావార్ వివేకానంద అన్నారు. ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు జిల్లా కేంద్రంలోని పెన్‌గంగ గెస్ట్‌హౌస్‌లో నేరుగా వచ్చి సంప్రదించవచ్చని తెలిపారు.

## నగదు పట్టివేత

ఖానాపూర్ రూరల్, ఏప్రిల్ 29 : ఖానాపూర్ మండలంలోని బాదనకుర్తి చెక్‌పోస్ట్ వద్ద సోమవారం ఉదయం అధికారులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీల్లో ఏనుగుల రాములు వద్ద నుంచి రూ. ఒక లక్ష.. బసిరొద్దీన్ వద్ద నుంచి రూ.59,500, కేంద్ర బక్కయ్య నుంచి రూ.90వేలు, బైరి అంజయ్య నుంచి రూ.2.2 లక్షలు సీజ్ చేసినట్లు తెలిపారు.

## రూ.1.13 లక్షలు..

సారంగాపూర్, ఏప్రిల్ 29 : తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన సిరిపెల్లి చెక్‌పోస్టు వద్ద సోమవారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు.ఈ తనిఖీల్లో మహారాష్ట్రలోని హిమాయత్‌నగర్‌కు చెందిన రామచంద్ర వసంత్‌రావు తన కారులో రూ.1.13 లక్షలను తీసుకుని స్వర్ణ గ్రామం వస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. నగదును కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక అధికారికి అప్పగించామని ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు.

# మైక్రో అబ్జర్వర్ ర్యాండమైజేషన్

ఎదులాపురం,ఏప్రిల్ 29 : పార్లమెంట్ నియోజకవర్గాలవారీగా మైక్రో అబ్జర్వర్స్ ర్యాండమైజేషన్‌ను సాధారణ పరశీలకుడు రాజేంద్రవిజయ్, జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజర్షి షా ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎన్ఐసీ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఆదిలాబాద్‌లో 14, బోథ్‌లో 30, ఆసిఫాబాద్‌లో 24, సిర్పూర్‌లో 16, నిర్మల్‌లో 30, ఖానాపూర్‌లో 49, ముథోల్‌లో 27 మొత్తం 190 మైక్రోఅబ్జర్వర్స్‌ను కేటాయించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్‌ల ఈడీఎంలు, డీఈవోలు, కలెక్టరేట్ ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.








